

విశాలాంధ్ర శ్రీకాకుళం

సోమవారం 30, జూన్ 2025

చురుకుగా జరుగుతున్న అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం కురుడు పంచాయతీ పాకి వలస గ్రామంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పంచాయతీ ఇంచార్జ్ నాళ్ళ చిన్ని నేతృత్వంలో సిసి రోడ్లు, కాలుపై వంతెన, డ్రైన్లు వంటి పనులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు తమ పంచాయతీ సమస్యలు విన్నవించుకున్నామని, అయితే అడిగిన వెంటనే గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు సమకూర్చాలని, వాటితో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చిన్ని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు.

శిథిలావస్థలో వ్యవసాయ శాఖ కార్యాలయం

విశాలాంధ్ర-జలుమూరు : మండల కేంద్రంలో గల వ్యవసాయ శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది మూడు దశాబ్దాల క్రితం ఆనాటి ప్రభుత్వం దీనిని నిర్మించి ప్రారంభించింది భవనం పైన కార్యాలయ సిబ్బంది దిగువన గిడ్డంగి ఉండే విధంగా ఆనాడు ప్రభుత్వం దీన్ని నిర్మించింది. ప్రస్తుతం గోడలు బీటలు బారి పైన స్లాబ్ పూర్తిగా బీటలు బారడంతో చిన్నపాటి వర్షం వస్తే కార్యాలయం నిండా నీరు చేరుతుందని దీనివలన అనేక ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది తెలిపారు. పాలకుల పరిశీలించి రైతాంగాన్ని అవసరమైన వ్యవసాయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

రొట్టవలసలో అనధికార ప్రైవేట్ బార్స్

- ఒక్కో బార్‌కు రూ.3వేలు చొప్పున వసూళ్లు
- యాదేచ్ఛగా నడుపుతున్న 3 బార్‌లు
- మరో రెండు కొత్త బార్‌లు ఏర్పాటుకు రంగం సిద్ధం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస వైన్ షాప్ ఆధ్వర్యంలో ప్రస్తుతం మూడు బార్ లు నిర్వహిస్తున్నారని పలువురు వ్యాఖ్యానించారు. నిర్వాహకులు యాజమాన్యానికి నెలవారీ చెల్లింపులు చేస్తున్నారని అన్నారు. బార్ లో తాగటానికి వచ్చినవారికి నిర్వాహకులు భయపడవద్దని, మాకు అధికారుల అండదండలున్నాయని అర్జునుడుకి శ్రీ కృష్ణుడు గితోపదేశం చేసినట్లు వెన్నుతట్టి ధైర్యం చెప్తుండటం గమనార్హం అన్నారు. స్థానిక పోలీస్ లు ఎప్పటికప్పుడు రైడ్ చేస్తూ ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేస్తున్నారు. బార్‌లో మద్యం సేవిస్తున్నవారికి ఓపెన్ డ్రింకింగ్ కేసులు వెయ్యడం యొక్క ఆంతర్యమేమిటో ఆది దేవునకే తెలియాలి. జిల్లా అధికారులైన స్పందించి అనధికారిక బార్ లను తొలిగించి, మద్యం యాజమాన్యం పై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

6న రజకుల ఆకాంక్ష సభను విజయవంతం చేయండి

- రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము పిలుపు

విశాలాంధ్ర-రణస్థలం : జూలై 6న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజకవెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సి.సావిత్రి అధ్యక్షతన రాజమహేంద్రవరం లో జరగబోయే రజకుల ఆకాంక్ష సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాము మాట్లాడుతూ రాజమండ్రి పార్లమెంట్ ఎంపీ బిజెపి ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి ముఖ్య అతిధి గా అలాగే రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభకు అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ, రజక సంఘాల నాయకులు మేధావులు రజకులు హాజరై సభను విజయవంతం చేయాలని డైరెక్టర్ రాము కోరారు.

రెండు సాహితీ, అభ్యుదయ పుస్తకాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి చిగురుపల్లి ప్రభాకరరావు తన భార్య చంద్రకళ జ్ఞాపకార్థం ప్రచురించిన రెండు సాహితీ, అభ్యుదయ పుస్తకాలును ఆదివారం పట్టణంలోని బాపూజీ కళామందిర్ లో పలువురి ప్రముఖుల సమక్షంలో అతిధిలు ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం. మదన్మోహన్ సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఈ సభ లో "గీసి చేరిపే బొమ్మ" మరియు "ఉరికంభం సాక్షిగా" పుస్తకాలు ఆవిష్కరణ అనంతరం వాటి పరిచయ కార్యక్రమం జరిగింది. ఉరికంబం సాక్షిగా పుస్తకంను పరిచయం చేస్తూ రాష్ట్ర ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడారు. ఈ రచన ప్రఖ్యాతి రచయత దివికుమార్ 2013లో రచించగా ద్వితీయ ముద్రణగా నేడు మళ్ళీ సాహితీ లోకంలోకి అడుగు పెట్టిందని తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయలు, రచయత కంచరాన భుజంగరావు వ్రాసిన గీసి చెరిపే బొమ్మ కవితా సంపుటిని డాక్టర్ సుంకర గోపాల్ పరిచయం చేశారు. చిగురుపల్లి చంద్రకళ స్మారక కళా పీఠం వ్యవస్థాపకులు ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఐక్యంగా గతంలో చేసినటువంటి ఉద్యమాల మాదిరిగానే మరిన్ని ఉద్యమాలతో ముందుకు వెళుతూ విజయం సాధించాలని సూచించారు. అందరికీ మేలు జరిగే సందేశం పంచే పలు పుస్తకాలను మా సంస్థ ద్వారా ప్రచురించే బాధ్యతను తీసుకుంటమన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనిల్, రాష్ట్ర కార్యదర్శి సరస్వతి, ప్రముఖ రచయత అట్టాడ అప్పలనాయుడు, కవి లండసాము మురళీకృష్ణమూర్తి, అధ్యాపకులు డా. కె. ఉదయ్ కిరణ్, బాదాన శ్యామల రావు తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్, సాయితీ స్రవంతి, శ్రీకాకుళం సాహితీ, జన సాహితీ వంటి సాహిత్య, ఉపాధ్యాయ సంస్థల ప్రతినిధులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

60 ఏళ్లు నిండిన జర్నలిస్టులకు పెన్షన్ అందించాలి

ఏపీ ఓల్డ్ ఏజ్ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రీ శంకర రెడ్డి

విశాలాంధ్ర-వలాస : జర్నలిజంను వృత్తిగా నమ్ముకుని 60 ఏళ్లు దాటి పనిచేస్తున్న వయోధిక పాత్రికేయులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల పదివేల రూపాయలు పింఛన్ మంజూరు చేయాలని రాష్ట్ర ఓల్డ్ ఏజ్ వర్కింగ్ జర్నలిస్టుల సొసైటీ అధ్యక్షులు కర్రీ శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పలాసలో జరిగిన జిల్లా జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా వయో భారంతో వృత్తి నుండి విరమించుకున్న లేక పనిచేస్తున్న వయోధిక పాత్రికేయులకు పింఛన్ మంజూరు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు ప్రమాద బీమా, ఎటువంటి షరతులు లేకుండా ఇళ్ల స్థలాలు మంజూరు, 58 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికి వెటరన్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని అలాగే జిల్లా అక్రిడేషన్ కమిటీలో ఒక సభ్యునికి నియమాకం తదితర చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానించిందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో తాము పేర్కొన్న లబ్ధి పొందుతున్న డిమాండ్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని ఉదహరించారు. త్వరలో తమ సొసైటీ తరపున దినపత్రికను ప్రారంభించేందుకు సన్న హాలు చేస్తున్నమన్నారు. తమ సొసైటీలో ఏ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని అన్ని జర్నలిస్టుల యూనియన్లను తమ సొసైటీ సమానంగానే పరిగణిస్తుందని, అన్ని యూనియన్ల సహకారం తమకు అవసరమన్నారు. ఈ సమావేశంలో సొసైటీ కార్యదర్శి పి.వి.ఎస్.ఎన్.మూర్తి ఉపాధ్యక్షులు దేవ విశ్వేశ్వరరావు(నాని) సారవకోట విశ్వేశ్వరరావు, కోశాధికారి బాగాది వాసు, కొండ అప్పారావు, సంపతి రావు విశ్వనాథం, దనేశ్వర మహారణ, డి నాగరాజు, నందేటి చందనరావు, ఆశి కిషోర్ కుమార్ రెడ్డి,డి. నాగరాజు శివ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన పురుషోత్తం మజ్జి కుమార్తు మూడు నెలల వయస్సులోనే హైడ్రోసెఫలస్ ఇన్ఫెక్షన్(బ్రెయిన్లో వాటర్ క్లాటు ఇన్ఫెక్షన్) కావడంతో సర్జరికీ అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న మా మాణికేశ్వరి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు తక్షణ సహాయం కింద రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి చిన్నారికి వైద్య ఖర్చు నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని మా మాణికేశ్వరి హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మా మాణికేశ్వరి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

పలాస, టెక్కలిలో డివిజన్ స్థాయి రెవెన్యూ సమావేశాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : జిల్లాలో రెవెన్యూ పరిపాలన మరింత సమర్థవంతంగా ఉండేందుకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం పలాసలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం, పలాస డివిజన్ అధికారుల సమావేశాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. అలాగే అంటే జూలై 2 వ తేదీన టెక్కలిలో టెక్కలి డివిజన్ రెవెన్యూఅధికారుల సమావేశం జరుగనుంది. ఈ మేరకు వివరాలు తెలియజేస్తూ జిల్లా రెవెన్యూ అధికారి మారెళ్ళ వెంకటేశ్వరరావు ప్రకటన విడుదల చేశారు. సమీక్ష సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించి, పరిష్కార మార్గాలు సూచించనున్నట్లు తెలిపారు.

చెట్టును తొలగించి భవనాన్ని రక్షించండి

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో గ్రామీణ ఉపాధి పథకం కార్యాలయం భవనానికి ఆనుకుని ఉన్న భారీ వృక్షాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఎటువంటి గాలులు ఈదురు గాలులు వేసిన సమయాల్లో చెట్టు నేలకొరిగితే ప్రభుత్వ కార్యాలయం కూలిపోతుందని ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిరంతరం ప్రజలతో కిట కిటలాడుతున్న ఉపాధి హామీ పథకం కార్యాలయం ఈ చెట్టు ఒరిగితే ఎంతో ఇబ్బందికరమని కార్యాలయంలో ఉన్న వారి పరిస్థితి ఏమవుతుందోనని ప్రజలు అంటున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఉదయపురం గ్రామానికి చెందిన రాయల తిరుపతి (49) శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కాశీబుగ్గ ఎ.ఎస్.ఐ. ప్రకాష్ రావు తెలిపారు. కుటుంబ సభ్యులు, కాశీబుగ్గ పోలీసులు కథనం మేరకు రాయల తిరుపతి వెల్డింగ్ చేస్తుంటాడు. మద్యం సేవించడం అలవాటు. కొద్ది కాలం నుంచి విపరీతంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మద్యం సేవించి వచ్చి నివాస గృహానికి సమీపంలో మండపంపై నిద్ర పోతాను చెప్పి వెళ్ళాడు. ఇంటికి ఎంత సేపటికి రాకపోవడంతో మండపం వద్దకు వెళ్ళి చూసే సరికి అప్పటికే మృతి చెందారు. ఈ విషయం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగినట్లు తెలుస్తోంది. మృతుడుకు బార్య శాంతి, కుమారులు అచ్చుతరావు, మనోజ్ లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ ఎ.ఎస్.ఐ. ప్రకాష్ రావు తెలిపారు.

పూర్తిగా పాచై, నాచుపడుతున్న తిలారు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలు

విశాలాంధ్ర-జలుమూరు : మండలం తిలారు రైల్వే స్టేషన్ ప్లాట్ఫారములు పూర్తిగా పాచై నాచుపట్టింది. ఈ ఫ్లాట్ ఫారాలపై ప్రయాణికులు నడవడానికి భయాందోళన చెందుతున్నారు. పొరపాటున కాలుజారితే కాలు గాని వెన్నుపూస గాని విరగక తప్పదని ప్రయాణికులు ఆందోళన చేస్తున్నారు. రైళ్లు వచ్చే పోయే సమయాల్లో పొరపాటున ప్రయాణికులు ఆందోళన పడితే ప్రమాదం తప్పదని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి ఇంత దారుణంగా ఉన్న ప్లాట్ఫారాలను పరిశుభ్రం చేసి ప్రయాణికుల సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే మామిడి జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

సామాజికవేత్త టిడిపి యువనేత భామిడి

విశాలాంధ్ర-కొత్తూరు : పాతపట్నం ఎంఎల్‌ఏ మామిడి గోవిందరావు జూలై 1తేదిన జన్మదినం నాడు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త, టీడీపీ యువ నేత భామిడి రాజు ఇక్కడ మీడియాకు తెలిపారు. కొత్తూరు మండలం కుంచాలపేట కేంద్రంలో వైద్య శిబిరం, బ్లడ్.క్యాంపు హాస్పిటల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపడతాం అని సామాజికవేత్త, టీడీపీ యువనేత భామిడిరాజు తెలిపారు. ఎంఎల్‌ఏ మామిడి అభిమానులు టీడీపీ క్యాడర్ సేవాకార్యక్రమాలు విజయవంతంకు సహకరిం చాలని ఆయన అన్నారు.

బ్రిక్ ఇండస్ట్రీనా.... ఉమా రామలింగేశ్వర ఫ్లై యాష్ ఫ్యాక్టరీనా..?

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని కొత్తకోట వైపు వెళ్తున్న వంశధార కుడి కాలువపై ఉమా మహేశ్వర రావు శ్రీశ్రీశ్రీ ఉమా రామలింగేశ్వర ఫ్లై యాష్ బ్రిక్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ లో కొంత భాగం వంశధార లో ఉందని రెవిన్యూ వారు తొలుత నిర్మాణాన్ని నిలుపుదల చేసారు. తరువాత సర్వే చేసి ఎంత భాగం ఉందొ అక్కడ మార్క్ చేసారు. అయితే వంశధార అధికారులతో సంప్రదింపులు చేసి స్థానిక వ్యక్తి అండదండలతో బ్రిక్ ఇండస్ట్రీ నిర్వహిస్తున్నట్లు ఏ.పీ.జే.డబ్ల్యూ.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సీపాన తవిటినాయుడు తెలియచేసారు. చిగురు వలసలో మారుమూల ప్రదేశంలో వంశధార కాలువ గట్టు పై ఉన్న పాకలు తొలిగించిన అధికారులకు సరుబుజ్జిలి పాలకొండ రోడ్డులో వున్నా ఈ ఫ్యాక్టరీ కనపడటం లేదా అని ప్రశ్నించారు. మండల రెవిన్యూ సిబ్బంది ఆక్రమాలను గుర్తించి వంశధార వారికి తెలియపరిచినా అధికారులలో మార్పు రాకపోవటం చూస్తుంటే ఇది ఉమా రామలింగేశ్వర ఫ్లై యాష్ బ్రిక్ ఫ్యాక్టరీ లా లేదని వంశధార అధికారులు నిర్వహిస్తున్న వంశధార బ్రిక్ ఫ్యాక్టరీ లా ఉందని, లేదంటే చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని తవిటినాయుడు మరియు పలువురు స్థానికులు పేర్కొన్నారు.

తహసిల్దార్ వివరణ... ఇదివరకే మా సిబ్బంది నిర్మాణదారునికి తెలియ పరిచారు, వంశధార డిపార్ట్మెంట్ వారికీ తెలియపరిచాము బ్రిక్ ఫ్యాక్టరీ కొలతల వేసి వంశధార స్థలాన్ని గుర్తించి మార్క్ చేసాము. తదుపరి చర్యలు వంశధార వారు తీసుకోవలసి వుంది.

- మధుసూదనరావు

మందస ఐసిడిఎస్ పిడి పూర్తి బాధ్యతలు బాపట్లలో...

ఇన్చార్జి బాధ్యతలు మందసలో..
ప్రాజెక్టు ఉద్యోగులకు జూలై నెల జీతాలు అందేనా..?

విశాలాంధ్ర-మందస : మందస అంగన్వాడి ప్రాజెక్టు కార్యాలయం పాలన వ్యవహారం వినే వారికి.. చూసే వారికి..కార్యాలయం సిబ్బందికి.. అంగన్వాడీ కార్యకర్తలకు.. ఆయాలకు విచిత్రకరంగా ఉంది. ఈ కార్యాలయానికి రెగ్యులర్ ప్రాజెక్టు అధికారిని నియమించలేదు.ఇక్కడ పనిచేసిన ప్రాజెక్ట్ అధికారిని వసుంధర దేవిని సోంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. ఈమె మందస నుండి సోంపేట ఐసిడిఎస్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టింది. ఈమె స్థానంలో మందస ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి ఇంచార్జ్ ప్రాజెక్టు అధికారిగా ఆంధ్రప్రదేశ్ రాజధానికి సమీపంలో ఉన్న బాపట్ల అంగన్వాడి ప్రాజెక్టు డైరెక్టర్ ను నియమించారు. ఇంచార్జ్ గా నియమితులైన ఈ ప్రాజెక్టు అధికారి ఇక్కడ జాయినింగ్ అయిన తర్వాత తిరిగి కార్యాలయం వైపు చూడటం మానేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ అధికారికి ఇక్కడ అనుకూలమైన స్థలం కాదన్న కారణంతో కార్యాలయానికి రావడం లేదని పలువురు అంటున్నారు. బాపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పిడికి ఇక్కడ అంగన్వాడి ప్రాజెక్టు కార్యాలయానికి ఇన్చార్జిగా నియమించడమేమిటి..? అనేది ఈ శాఖ ఉద్యోగుల్లోనే చర్చ జరుగుతోంది. కాగా బాపట్ల ఐసిడిఎస్ పి.డిగా పనిచేస్తున్న అధికారి మందస ప్రాజెక్టుకు ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ ఈ అధికారి ఎవరో ఇంతవరకు అంగన్వాడి సూపర్వైజర్లకు, కార్యకర్తలకు, కార్యాలయంలో సగం మంది సిబ్బందికి తెలియకపోవడం విశేషం. ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత కార్యాలయం వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మందస మండలంలో అంగన్వాడి కేంద్రాల పనితీరు అస్తవ్యస్తంగా తయారయింది. సూపర్వైజర్ లే కేంద్రాల పరిరక్షణ చేస్తూ అంగన్వాడి కార్యకర్తలతో ప్రాంతాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా మందస మండలంలో పనిచేస్తున్న అంగన్వాడి సూపర్వైజర్లకు ఎక్కడి కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి జూలై నెల మొదటి వారంలో అందాల్సిన జీతాలు అందే పరిస్థితి కనిపించడం లేదని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు రెగ్యులర్ పిడి లేకపోవడం ఇన్చార్జి పిడి కార్యాలయానికి రాకపోవడంతో ఈనెల 25వ తేదీ లోగా ఉద్యోగుల జీతాల బిల్లులు ప్రతిపాదన చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు జీతాల బిల్లు ప్రతిపాదన ఈ కార్యాలయం నుండి లేకపోవడంతో జూలై నెల మొదటి వారంలో అందాల్సిన నెలసరి జీతాలు అందే పరిస్థితి పూర్తిగా కనిపించడం లేదని అంగన్వాడి ఉద్యోగులు అంటున్నారు. ఇక్కకడికి కార్యాలయం పరిస్థితి దయానీయంగా తయారైందని విమర్శలు వినవస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి రోణంకి కృషి ఎనలేనిది

విశాలాంధ్ర-పలాస : పలాస ఆర్టీసీ అభివృద్ధికి డిపో మేనేజర్ రోణంకి సీతారామ నాయుడు ఎనలేని కృషి చేశారని శ్రీకాకుళం, టెక్కలి డిపో మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, శర్మ, ఎన్ శ్రీనివాసరావు అన్నారు. పలాస ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డిపో మేనేజర్ రోణంకి సీతారామ నాయుడు ఆదివారం పదవి విరమణ చేసిన సందర్భంగా పలాస డిపో ఆర్టీసీ యూనియన్లు ఆద్వర్యంలో సీతారామ నాయుడు, దమయంతి దంపతులకు ఘనంగా సన్మానించారు. ముందుగా కాశీబుగ్గ బస్టాండ్ నుంచి పలాస ఆర్టీసీ డిపో వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అంతకుముందు జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ, తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం డిపోలో పని చేసే సమయంలో ఆర్టీసీ సంస్థ లాబాల బాటలో నడిపించేందుకు కృషి చేయడంతో అప్పటి ఆర్టీసీ ఎండీ సాంబశివరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారని గుర్తు చేశారు. ఆర్టీసీ యూనియన్లు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎటువంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించే వ్యక్తి రోణంకి సీతారామ నాయుడు అని కొనియాడారు. అనంతరం డిపో మేనేజర్ సీతారామ నాయుడు మాట్లాడుతూ తాను 38 ఏళ్ళు ఆర్టీసీ సంస్థలో పని చేశానని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుమారు ఆరు ప్రాంతాల్లో అక్కడ ఉద్యోగులు, ఆర్టీసీ యూనియన్లు సహాయ సహకారాలతో డిపోలు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఇటువంటి ఆర్టీసీ సంస్థలో పని చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను పదవి విరమణ చేపట్టిన అనంతరం ఉద్యోగులు, యూనియన్లుకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అంతకు ముందు డిపో మేనేజర్ దంపతులను కాశీబుగ్గ బస్టాండ్ నుండి డిపో వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కుమారుడు రోణంకి దవలేష్, భార్గవి, అల్లుడు మెట్ట శ్రావణ్, స్వర్ణ, శ్రీకాకుళం డిపో డిప్యూటీ ఇంజనీర్ రవి కుమార్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ డి కుమార్, అప్పలరాజు, ఎన్ ఎం ఎ అధ్యక్ష కార్యదర్శులు ఎ వి రావు, హెచ్ వి మూర్తి, డిప్యూటీ మేనేజర్ పినకాన సంతోష్ కుమార్, రామ్మోహన్ రావు, ఎస్ డి ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ నిర్మించేది ఎప్పుడు?

- జాతీయ రహదారే కూరగాయల మార్కెట్
- నేతల హామీలు గాలికి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం జాతీయ రహదారిలో గల చీపుర్లపాడు గ్రామం వద్ద కూల్డ్ స్టోరేజీ నిర్మాణం కల గానే మిగిలిపోతుంది. గత కొన్ని ఏళ్ల గా నిత్యం రైతులు తాము పండించే కూరగాయలను ఈ గ్రామం వద్దకు తీసుకువచ్చి తెల్లవారుజామునే వ్యాపారం సాగిస్తుంటారు. అటు పలాస, ఇటు శ్రీకాకుళం నుంచి వ్యాపారులు పెద్ద ఎత్తున ఇక్కడినుండి కూరగాయలు కొనుగోలు చేసి తీసుకు వెళ్తుంటారు. అయితే అమ్మగా మిగిలిన కూరగాయలను నిలువు చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ లేక పోవడంతో రైతులు తాము పండించినకూర గాయాలను వ్యాపారులకు, దళారులకు గిట్టుబాటు కాకపోయినా తక్కువ ధరకే విక్రయాలు చేసేస్తుంటారు. ఇదిలా ఉండగా రోడ్డు మీద వ్యాపారం సాగుతూ ఉండటం వలన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమని జీవనం సాగించవలసి వస్తుందని సంబంధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇక్కడ ఒక కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేపట్టాలని ఎన్నిసార్లు ప్రజా ప్రతినిధులుకు, అధికారులకు విన్నవించుకున్న, ఎన్ని ప్రభుత్వాలు మారినా ఫలితం లేకపోతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొన్నేళ్ల క్రితం మంత్రి అచ్చనాయుడు చొరవతో ఈ ప్రాంతంలో తరలిపేట సమీపంలో రెండు ఎకరాలు స్థలాన్ని కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించింది. అయితే ఆ స్థలాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఆక్రమించే ప్రయత్నం చేశారు. అప్పట్లో తల్లి పేట గ్రామానికి చెందిన పెద్దలు దాన్ని అడ్డుకోవడంతో అక్కడితో ఆక్రమణకు ఫుల్ స్టాప్ పడింది. ఇప్పటికైనా స్పందించి అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసాదించి ఇక్కడ కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపట్టి రైతులను ఆదుకోవాలని సర్వత్ర కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కొరికాన చైతన్య మృతి

మృతదేహంతో రోడ్‌పై బైఠాయించిన గ్రామస్థులు

విశాలాంధ్ర-నందిగాం : మండలంలోని కవిటూరు సమీపంలోని ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పూండి నుంచి పలాసకు వెళ్తున్న కొరికాన చైతన్య అనే యువకుడ్ని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డీకొట్టినట్లు స్థానికులు చెప్పారు. ఈ ప్రమాదంలో కొరికాన. చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొండ ఊరు గ్రామానికి చెందిన వాడని గుర్తించారు. సమాచారం అందుకున్న వజ్రపు కొత్తూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

జూలై 17 వరకు ఐటిఐ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వెరిఫికేషన్

డిఎల్‌టిసి అసిస్టెంట్ డైరెక్టర్ మోహన్‌రావు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : జిల్లాలో కల డి ఎల్ టి సి లో వివిధ ట్రేడ్లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై 17న దృవపత్రాలు వెరిఫికేషన్ చేయించుకోవాలని జిల్లా డిఎల్టిసి అసిస్టెంట్ డైరెక్టర్ ఎండ మోహన్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ లో 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటివరకు 150 మంది విద్యార్థులు మాత్రమే దృవపత్రాలు వెరిఫికేషన్ చేయించుకున్నారని ఆయన తెలిపారు. జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, జూలై 17 సాయంత్రం ఐదు గంటల్లోగా బలగ జంక్షన్ వద్ద ఉన్న ప్రభుత్వ డిఎల్టిసి కార్యాలయంలో వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. ధ్రువపత్రాలు వెరిఫికేషన్ చేయించుకోపోతే సీట్లు లభించవని ఆయన తెలిపారు.

ఈనెల 9న శ్రీముఖలింగంలో భాలీ యాత్ర ప్రారంభం : డాక్టర్ జీవితేశ్వరరావు

విశాలాంధ్ర-జలుమూరు : మండలం శ్రీముఖలింగం గ్రామంలో ఈనెల 9న భారీ స్థాయిలో బాలీయాత్ర జరుపుటకు కమిటీ నిర్ణయించిందని కమిటీ సభ్యులు డాక్టర్ జీవితేశ్వరరావు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది భారీ స్థాయిలో రాష్ట్రంలో గుర్తింపు పొందే విధంగా ఏర్పాట్లు చేయుటకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు జీవితేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం కమిటీ సభ్యులతో పాటు అర్చకులు పెద్దలు సమావేశాన్ని నిర్వహించారు. అన్ని ఏర్పాట్లు చేయుటకు అందరం సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమి టీ సభ్యులు స్థానిక అర్చకులు ప్రజలు పాల్గొన్నారు.

వసప గ్రామంలో ప్రధాన మోడీ మన్‌కిబాత్ వీక్షన

విశాలాంధ్ర కొత్తూరు : మండలం వసప బీజేపీ నాయకులు మండ రామ్మూర్తి నివాసంలో ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ ప్ర సంగం ప్రతి నెల చివరి ఆదివారం తన మనసులో ఉన్న మాటలని ఈ దేశ ప్రజలతో పంచుకునే 'మన్ కివిన్ బాత్' కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు గారు పాల్గున్నారు. ఈ కార్యక్రమం బీజేపీ నాయకుల, కార్యకర్తలు గ్రామస్తులతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమం లో కొత్తూరు మండల బీజేపీ అధ్యక్షులు బురదా భాస్కరరావు గారు, జిల్లా కార్యదర్శి వలురౌతు ప్రసాద్ గారు,పూర్వ మండల అధ్యక్షులు నరసింహామూర్తి గారు,వసప సర్పంచ్ వలు రౌతు ఆఫీస్, బీజేపీ నాయకులు మండ రామ్మూర్తి ,జాన్ కటారి కాపలా దమయంతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో 'ఆలోచించు నిదానంగా ఓ క్షణం' సీడీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలం అక్కుపల్లి గ్రామంలో ఆదివారం పుక్కల్ల క్రియేషన్ పై నిర్మితమైన 'ఆలోచించు నిదానంగా ఓ క్షణం 'ఆడియో,వీడియో లాంచ్ ఘనంగా నిర్వహించా రు. పుక్కల్ల రాజేంద్ర స్వర కల్పనలో,స్వీయ దర్శకత్వం వహించిన ఆడియో వీడియోను ఏ.పీ. తెలుగు ఫిలిం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్.కుమార్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షులు మామిడి కృష్ణారావు మాట్లాడుతూ నిదానంగా ఆలోచించు అని యువతకు సందేశం అందజేయడం పట్ల ఆనందం వ్యక్తపరిచారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక పూర్వపు అధ్యక్షులు రాపాక ధనరాజు మాట్లాడుతూ సందేశాత్మక ఆడియోలు రిలీజ్ చేసినందుకు, స్థానిక కళాకారులకు అవకాశం ఇచ్చినందుకు హర్షం వ్యక్తపరిచారు. ప్రముఖ డాన్సర్ కుంది రాజా మాట్లాడుతూ ఉద్దానంలో నిష్ణానితులైన కళాకారులు ఉన్నారని వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దు నాగేశ్వరరావు,కొరియోగ్రాఫర్ మౌళి, డి.ఓ.పి ఎడిటింగ్ కళ్యాణ్, పోస్టర్ డిజైనింగ్ మనోజ్ కుమార్, కాస్టింగ్ చందు, రాకేష్, గాయత్రి, అసిస్టెంట్ డైరెక్టర్ గా సిహెచ్ కామరాజు వ్యవహరించగా, ప్రవీణ్, అఖిల్, ఖగేష్, షూటింగ్ లో సహకరించారు.

కూర్మావతారంలో జగన్నాథస్వామి

విశాలాంధ్ర-కవిటి: కూర్మావతారంలో జగన్నాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కవిటి బెహరా వీధిలో వెలసివున్న జగన్నాథ స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా విశేష పూజలు, అర్చనలు,హెూమాలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జూలై 5న నాలుగో విడత చందనం అరగదీత ప్రారంభం

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి నాలుగో విడత చందనం అరగదీత జూలై 5 నుండి ప్రారంభం కానున్నట్లు వైదిక వర్గాలు తెలిపాయి. జూలై 10వ తేదీ ఆషాఢ పౌర్ణమి సంధర్భంగా సింహాద్రినాధునికి ఆఖరి విడత చందన సమర్పణ ఏర్పాట్లు ప్రారంభం కానున్నట్లు వైదిక పెద్దలు తెలిపారు. అప్పన్న స్వామి కి ఆఖరి విడత చందన సమర్పణ తో స్వామీ నిండుగా గురుడు ఆకారంలో భక్తులకు దర్శనం ఇస్తారు కనుక గురు పున్నమి అంటారని వైదిక పెద్దలు తెలిపారు. తొలి విడత చందనయాత్ర నాటి రాత్రి వైశాఖ శుద్ధ తదియ, రెండవ విడత వైశాఖ పౌర్ణమి , మూడో విడత జేష్ఠ పౌర్ణమి , నాలుగో విడత ఆషాడ పౌర్ణమీ లకు నాలుగు విడతలుగా, చివరిగా శ్రావణ పౌర్ణమి రోజు పెరుమాళ్ళు కు కరాళ చందన సమర్పించటం జరుగుతుంది. అదేవిధంగా నాడు ఢిల్లీ నవాబు కొలువులో అతనితో వాదించిన విశిష్టాద్వైత మత స్థాపకులు, మానవ తత్వ ప్రచారకులు భగవత్ రామానుజాచార్యులు విజయాన్ని సాధించినందుకు గుర్తుగా ప్రతి ఏటా ఆషాడమాస పూర్ణిమ రోజున ఢిల్లీ విజయం అనే ఉత్సవాన్ని వైష్ణవ దేవాలయాల్లో జరుపుకోవడం ఆచారంగా వస్తోంది

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

విశాలాంధ్ర-సింహాచలం : ఆదిశేషుడిపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన వైకుంఠనాథుడు సింహగిరి శిఖరంపై దివ్య తేజోమయుడై కొలువుదీరిన వేళ ప్రకృతి పరవశించి పోయింది. ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి వి త్రినాధరావు ఆదేశాల పర్యవేక్షణలో ఆదివారం ఉదయం వైకుంఠవాసుల మెట్ల వద్ద వరద పాయసం కార్యక్రమం శాస్త్రోక్తంగా ప్రారంభం అయ్యి సుమారు రెండున్నర గంటలపాటు జరిగింది. తొలుత స్వామికి విశ్వక్సేన, పుణ్యాహవచనం పూజలు నిర్వహించారు. అనంతరం విరాటపర్వ పారాయణం, నారాయణ పాశురాలు, గరుడాళ్వార్ విగ్రహ స్థాపన , మంగళహారతి . స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పాలు, పెరుగు, పంచామృతాలతో అభిషేకం చేశారు. పట్టు వస్త్రాలు పూదండలు, తులసి దళాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామికి అభిషేకం, ఆరాధన, నివేదన సమర్పించారు. ఇఓ దంపతులు, ఆలయ స్థానాచార్యులు టీపీ రాజ గోపాలాచార్యులు, ప్రధాన అర్చకులు జి. శ్రీనివాసాచార్యులు, ప్రధాన అర్చకులు (2) కర్రి సీతారామాచార్యులు, వేదపం డితులు, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు బాగా కురిసి గ్రామాలన్నీ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, రాళ్లపై వరద పాయసం పారించారు. ప్రత్యేక పూజల తర్వాత అర్చకులు అక్కడ పాయసం తయారు చేశారు. పండితులు వేద మంత్రోచ్ఛారణ చేస్తుండగా వరద పాయసం పోశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పాయసం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈవో ఆనంద్ కుమార్, ఈఈ రమణ, అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గీతంలో జ్యోతిష శాస్త్రంపై జాతీయ సదస్సు

విశాలాంధ్ర-మధురవాడ : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రలా జికల్ సైన్సెస్ (ఐ.సి.ఎ.ఎస్) ఆధ్వర్యంలో 29-06-2025 తేదీన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సును (ఐ.సి.ఎ.ఎస్) ఆధ్వర్యంలో నిర్వ హించి నట్లు నిర్వాహక కార్యదర్శి, విశాఖ శాఖ అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఆరోగ్యమే మహ భాగ్యము ఆధ్యాత్మికత, సనాతన ధర్మం అనుసరణ తద్వారా మానసిక, శారీరక ఆరోగ్య సాధనపై ప్రముఖుల ప్రసంగించారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఐ.సి.ఎ.ఎస్. జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు శ్రీ నవనీత కౌశిక్ ముఖ్య అతిధిగా హాజరై కీలక ఉపన్యాసం చేసారు. ఉపాధ్యక్షులు డాక్టర్ ఎమ్.ఆంజనేయులు, సౌమ్య కుమార్, ప్రదీప్ గౌడ, జొన్నలగడ్డ శ్రీనివాస్ రావు, బౌగోలికమిగా జరుగుతున్న వివిధ అంశములు పై జొన్నలగడ్డ శ్రీనివాస్ రావు వ్రాసిన వాస్తు చింతామణి గ్రరంథాన్ని ఆవిష్కరించనున్నట్లు. పేర్కొన్నారు. ఆరోగ్యమే మహ భాగ్యము పేరుతో జరిగే ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 200 మందికి పైగా జ్యోతిష శాస్త్రవేత్తలు హాజరయ్యారన్నారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ నాలెడ్జి సిస్టమ్స్ విశ్రాంత అధికారి, ఐ.సి.ఎ.ఎస్. జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.బి.శుక్లా ముఖ్య అతిధిగా హాజరై కీలక ఉపన్యాసం చేస్తారని, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎమ్.ఆంజనేయులు, నవనీత్ కౌశిక్, డాక్టర్ గాయత్రీ వాసుదేవ్ పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగిం చారు. ఈ సమావేశాల సందర్భంగా వాస్తు చింతామణి గ్రరంథాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్వాహక కార్యదర్శి పేర్కొన్నారు.

క్లస్టర్ టీచర్ల కష్టాలు- శాశ్వత పరిష్కారం కోరుతున్న ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-ఆమదాలవలస : పాఠశాల విద్యలో నాణ్యత పెంపొందించడమె లక్ష్యం గా పనిచేస్తున్న క్లస్టర్ అకడమిక్ టీచర్లు (సిఏటి) ప్రస్తుతం తీవ్రమైన అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. ఏ రోజు ఏ స్కూలుకు హాజరు కావాలో, ఏ రోజు ఏ స్కూల్లో ఏ సబ్జెక్టు బోధించా లో స్పష్టత లేకపోవడం వల్ల వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో క్లస్టర్ లో 10 నుంచి 15 వరకు పాఠశాలలు ఉండగా క్లస్టర్ పరిధిలోని ఎంఈఓ సెలవుపై వెళ్తే ఆ సమాచారం క్లస్టర్ టీచర్ కు ముందుగా తెలియదు. ఎంఈఓ సరైన సమయానికి క్లస్టర్ హై స్కూల్ హెచ్ ఎం కు సమాచారం అందించక పోతే క్లస్టర్ టీచర్ ఎక్కడికి వెళ్లాలో, ఏవిధంగా హాజరు కావాలో అస్ప ష్టత నెలకొంటోంది. ఇంతవరకు క్లస్టర్ అకడమిక్ టీచర్లకు స్పష్టమైన సేవా నియమాలు లేకపోవడం, వారు ఏ అధికారి డ్రాయింగ్ కంట్రోల్లో పని చేస్తున్నా రన్నది కూడా అంతు బట్టని పరిస్థితిలో ఉంది. ఈ కారణంగా ఎంఈఓ, పక్కనున్న ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ క్లస్టర్ హెడ్ మాస్టర్ మధ్య సమన్వయం లేకపోతే క్లస్టర్ టీచర్ పూర్తిగా త్రిశంకు స్వర్గంలో చి క్కుకు పోతున్నారు. దీనితో పాటు, ముఖ్యమైన విష యం ఏమిటంటే ముందుగా తెలియకపోవడంతో, టీచర్ ఏ పాఠశాలకు హాజర వ్వాలో తెలుసు కోలేక పోవడం, స్పెషల్ డ్యూటీ అప్లై చేసి వెళ్లే పాఠశాల లొకేషన్ నమోదు చేయడం కష్టమవుతోంది. ఇది హాజరు నమోదు కోసం లీవ్ యాప్ లోనూ చిక్కులు తెస్తోంది. ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉపాధ్యాయుల హాజరు పై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, నిర్దేశిత సమయం లోపల హాజరు నమోదు కాకపోతే ఆబ్సెంట్ గా గుర్తించి, జీతాల చెల్లింపుపై ప్రభావం చూపే విధంగా ఖజానా శాఖకు డేటా పంపే విధానం అమలులో ఉంది. ఈ నేపథ్యంలో క్లస్టర్ టీచర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సమస్య ల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని, ప్రతి పాఠశాలకు క్లస్టర్ టీచర్ ను కేటాయించాలి. లేదంటే క్లస్టర్ టీచర్లు మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇది వారి ఆరోగ్యంపై, కుటుంబ జీవనంపై ప్రభావం చూపిస్తోంది. ఈ సమ స్యలపై వెంటనే విద్యాశాఖ మంత్రి దృష్టి సారించి, క్లస్టర్ అకడమిక్ టీచర్ల సమస్యలకు శాశ్వత పరి ష్కారం చూపాలని ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

లోక కళ్యాణం కోసమే సత్సంగాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : లోక కళ్యాణం కోసమే సత్య సత్సంగాలు యాగాలు, యజ్ఞలు నిర్వహించడం జరుగుతుందని కాకినాడకు చెందిన ధన్వానంద సరస్వతి అన్నారు. ఆదివారం మండలం కూడికల పాడు గ్రామం లో సనవల కరుణ్ కుమార్ నేతృత్వంలో సత్సంగం, యజ్ఞం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అనేక రుగ్మతలు, ద్వేషాలు, కలుషిత వాతావ రణం నెలకొందని, ఇటువంటి వాటిని రూపుమాపేందుకు ఇటువంటి సత్సంగాలు యా గాలు యజ్ఞలు ఎంతైనా అవసరమని ఆయన అన్నారు. తద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని అందరూ ఐకమత్యంగా జీవనం సాగిస్తూ సన్మార్గంలో నడిచేందుకు దోహ దపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాలు అన్ని గ్రామాల్లోనూ నిర్వహిస్తుండాలని, యజ్ఞాలు యాగాల ద్వా రా వచ్చే పొగలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలతో పటు వర్షాలు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన ఆధ్యాత్మిక పండితులు పాల్గొన్నారు.

ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలకు వలసలు

గ్రామస్తుల మనసు దోచుకున్న ఉపాధ్యాయురాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఒక ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బదిలీపై ఆ గ్రామం చేరుకున్న ఒక రోజులోనే గ్రామస్తుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించారు. ఒకే ఒక్క విద్యార్థి ఉన్న ఆ పాఠశాలలో బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాల నాణ్యమైన విద్య కోసం వివరించి ఆన్లైన్ ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకున్న ఏడుగురు పిల్లలను పాఠశాలలో చేర్పిం చారు. గ్రామస్తులతో మమేకమై ఇప్పటికే పట్టణంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోకి ఆన్లైన్ ద్వారా ప్రవేశాలు పొందారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలో ఉన్న తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా వారి మనసును మా ర్చారు అంటే ఆ ఉపాధ్యాయురాలు విధుల నిర్వ హణలో నిబద్ధత స్పష్టమవుతుంది. వివరాల్లోకి వెళి తే ఆముదాలవలస మండలం కత్యాచార్యుల పేట పంచాయతీ పరిధి హనుమంతపురం మండల ప్రాథమిక పాఠశాలలో ఇప్పటివరకు ఒకే ఒక విద్యార్థి ఉండేవారు. అది కూడా వేరే పాఠ శాలలో ఉంటూ హనుమంతపురం పాఠశాలలో హాజరు ఉండేది. ఇటీవల ప్రభుత్వం జరిపిన ఉపాధ్యాయుల బదిలీలలో హనుమంత పురం మండల పరిషత్ పాఠశాలలో బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి గ్రామ స్తులతో ఇంటింటా తిరుగుతూ పిల్లల ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఇప్పటికీ 9 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఇంకా ప్రవేశాలకు సమయం ఉండ టంతో విద్యాభివృద్ధి పట్ల గ్రామస్తుల్లో నమ్మకం కలిగిస్తే మరో 12 మంది వరకు పాఠశాలలో చేరేందుకు ముందుకొస్తున్నట్లు తెలుస్తుం ది. ఎప్పటికీ ఆ తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయురా లతో మాట్లాడి వెళుతున్నారు. ప్రభుత్వం అందించే సర్వేపల్లి రాధాకృష్ణ విద్య కిట్లు ఇతర పుస్తకాలు మధ్యాహ్న భోజన పథకం వంటి వాటిని అందించే తీరుతెన్నులను గ్రామస్తులకు వివరించి విద్యార్థులను చేర్పిం చడం లో హనుమంతపురం పాఠశాల ఉపా ధ్యాయురాలు వారి మనసులో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇదే పరిస్థితిని ఉపాధ్యాయు లు మండల మంతా కొనసాగిస్తే ప్రైవేటు పాఠశాలల్లో ఉండే వారిని ప్రభుత్వ పాఠశాలలో వారి స్వగ్రామాల్లో ఉండేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని పలు వురు కోరుతున్నారు.

వృత్తి నైతికత నిబద్ధత ప్రధానం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో ఉన్న వారు తగిన రీతిలో శ్రమించడం ద్వారా గుర్తింపు ప్రజల మన్ననలు దక్కుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రబిన్ కుమార్ పాఢి అన్నారు. తన పదవీ విరమణ నేపథ్యంలో ఆదివారం కళాశాల అవరణలో విద్యార్థులు సిబ్బంది వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ, తొగారం, సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రీరాములు, గోవిందమ్మ , శ్యాంబాబు, సత్యన్నారాయణ, సుశాంత జెన, బారువా వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ గిన్ని సీతయ్యలు ప్రధాన అతిధులుగా హాజరైయ్యారు.

40 సంవత్సరాల పాటు ఉద్యోగం జీవితం గడిపి వివిధ స్థాయిలో తన కర్తవ్యాన్ని ఉన్నతంగా నిర్వర్తించడంతో పాటు అందర్ని గౌరవిస్తూ ఆత్మీయంగా మెలుగుతు స్థానిక డిగ్రీ కళాశాలకు రెండు దఫాలు నాక్ గుర్తింపు లభించేలా విశేష కృషి చేసి ఆదర్శంగా నిలిచారని వక్తలు అన్నారు. పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్ డా॥రబీన్‌కుమార్ పాఢి నిరాడంబర జీవితం, నిజాయితీ, సమయపాలన, క్రమశిక్షణ నేటి యువతకు భవిష్యత్ తరాలుకు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సంతోషకుమార్, నాగేశ్వరరావు, దుర్యోధన, శివకుమార్, సీతమ్మ రాజేంద్ర త్రిపాఠీ, బృందావనం, వర ప్రసాద్ తదితరులు డా॥రబీన్‌కుమార్ పాఢి, అతని సతీమణి నివేదిత పాఢిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతు వృత్తిని ఎంచుకున్నప్పుడు తగిన న్యాయం చేసే దిశగా నిరంతరం శ్రమించాలని, నైతిక విలువలకు కట్టుబడి, నిబద్ధతతో పని చేయడం అలవాటు చేసుకోవడం ద్వారా తగిన ఫలితాలు దక్కుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారులు ఆంజనేయ పాఢి, డా॥ అభినవ్ పాఢిలతో పాటు విశ్రాంత ప్రిన్సిపల్ డా॥ నిత్యానంద పట్నాయిక్, న్యాయవాది నాగరాజ్ పాత్రో, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, 20వ వార్డు ఇన్‌ఛార్జి సుభాష్ రౌళొ, పలువురు విశ్రాంత అధ్యాపకులు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు

రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వారికి జిల్లా పోలీసు అధికారులు కౌన్సెలింగ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : శ్రీకాకుళం జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాలమేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు రౌడీషీటర్లకు, నేరచరిత్ర గలవారికి, పాత నేరస్తులకు, చెడునడవడిక కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషనులో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిం చారు.ఈ మేరకు పాత నేరస్థులు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ కార్య క్రమం కొనసాగింది. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించిలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. పోలీసు వారి ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన మరింత కేసులు నమోదు చేస్తామని తెలిపారు.ఎవరైనా సత్ప్రవర్తన మార్చుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానితుల కదలికలను పోలీసు శాఖ ఎల్లపుడూ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, నేర ప్రవృత్తి విడనాడాలి అని సూచించారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

విశాలాంధ్ర-మందస: భూమి మీద సకల జీవరాసులకు ఆక్సిజన్ అందించి, వాతావరణ సమతుల్యానికి అందరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని తప్పని సరిగా సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మందస వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు మహిళలకు తెలిపారు. ఆదివారం మండలం పొత్తంగి గ్రామ సంఘం భవనం ఆవరణలో వన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మహిళలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చాలా సందర్భాలలో మొక్కలను నాటడం చేస్తున్నారే తప్ప..వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోకపోవడం వల్ల భూమి మీద పచ్చదనం లోపించి వర్షాలు సకాలంలో పడకపోవడం, ఎండ తీవ్రత ఎక్కువై ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతున్నట్లు వివరించారు. ఈ అన్ని సమస్య లకు కారణం నాటిన మొక్కలను బాధ్యతతో సంరక్షించ కపోవడమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు కాంతమ్మ, విజయ,తో పాటు వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు రమేష్, మంగమ్మ, లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్ , డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు,పొత్తంగి వి.ఓ.ఏ.భారతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి డా. సీదిరికు సన్మానం

విశాలాంధ్ర, పలాస: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నివాస గృహం లో ఆదివారం వైసీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ వైసీపీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడుగా నర్తు.వెంకటరమణను నియమించడంతో ఆయన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు.గోపీ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి. దుర్యోధ నరావు, మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి.సంతోష్ కుమార్, పట్టణ పార్టీ కార్యదర్శి రంది.రా జారావు, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పురుషోత్తపురం స్థానిక నాయకులు కింతల.జనార్ధన, మల్ల.నాని, ముద్దా పు.శ్రీరాములు, ముద్దా పు. నరసింహ, యాళ్ల.సంతోష్, వంకల.రాజు, నెయ్యల.శివ, బద్రి. శ్రీకాంత్, మరియు రపాక.లక్ష్మణ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మత్స్యకార సంఘం నాయకులు

విశాలాంధ్ర సంతబొమ్మాళి సంతబొమ్మలి మండలం లక్కి వలస పంచాయతీ గోలుగువానిపేట గ్రామానికి చెందిన గోర్లి రామారావు సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆదివారం జిల్లా మత్స్యకార సంఘం నాయకులు వచ్చి కుటుంబాన్ని పరా మర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కిందిలో పశ్చిమ నాయుడు సహకారంతో, ప్రభుత్వం నుంచి రావలసిన నష్టపరిహారాన్ని అందించేందుకు కృషి చేస్తామని వారన్నారు. జిల్లా మత్స్యకార నాయకులు కోడ. తాతారావు, పుక్కళ్ల శ్రీను, దాసరి. తవిటయ్య, కోడ. రంజిత్ పరామర్శించిన వారిలో ఉన్నారు. వీరితోపాటు లక్కి వలస పంచాయతీ టీడీపీ నాయకులైన పిట్ట. రాజులు, శ్రీరంగం.రాజులు శ్రీరంగం. ఎర్రయ్య శ్రీరంగం నూకరాజు. గోర్లి సత్తయ్య తుంబాల. నీలయ్య తుంబాల. అప్పయ్య చెక్క రాజయ్య అప్పన్న ఉన్నారు. పరామర్శకి వచ్చిన కోడ తాతారావు మృతిని కుటుంబానికి 25 కేజీల బియ్యం కూరగాయలు 2వేల రూపాయులు అందజేశారు.